# ప్రతిబింబాలు

శ్రీ రామారావ్

"పెళ్లి బాగానే జరిగింది కాని, తొందరపాటేమో అనిపిస్తుంది వీడు చేసిన పని. వీడు చేసుకోకపోయినా ఆమె బాధపడేదికాదు. అందర్లో ఒకడు. అనవసరంగా జీవితాన్ని నాశనం చేసుకున్నాడు." తిరుగుతున్న 'ఫ్యాన్' వంక చూస్తూ 'సీరియస్' గా అన్నాడు సుబ్బారావు.

"నీ వాలోచించటం లేదురా, అసలు — ఆమె బాధపడేదో, కాదో నీకెలా తెలుసు ?" అడిగాడు ప్రసాద్.

"ఆమె మనస్సులో దూరేం చూశానా, నేను మాత్రం— ఆమె గతాన్నిబట్టి—అస లిటువంటి వాళ్లను ఎందర్ని మార్చలేదది. నీకు మాత్రం ఏం తెలుసు ఆమె వాడినంత 'డీప్' గా 'లవ్' జేసిందని—?"

"ఆమెమీద ఉన్నవి పుకార్లేమో. కాస్త 'సోషల్'గా మూవ్, అయ్యేవాళ్లను ఎందర్ని అనుకోవటంలేదు. ఇక ఆమె మనవాణ్ని అంత 'సిన్సియర్' గా 'లవ్' చేసిందో లేదో తేల్చుకోవాల్సిందివాడు. నీవూ, నేనూ కాదు"—ప్రసాద్.

"నువ్వు నోర్మూయ్యరా కాసేపు. ఆ డాక్టరిగాడి పెళ్లాం డ్రైవరుతో లేచిపోయిందని విని ఎంత సానుభూతి చూపలేదు నీవు. నిజంగా లేచిపోయిందో లేదో నీవు చూశావా."

"ఇంతెందుకు—నేను కళ్ళారా చూశాను—చెప్తే నమ్ముతారా."—రామారావు అడిగాడు.

"నమ్మదగిందైతే నమ్ముతాం"—ప్రసాద్.

వాడు చూసిందేమిటో, వినాలనిపించింది నాకు.

"చెప్పరా వాడ్తో యేమిటి"—

"ఆ 'కార్సినోమా, పేషంటు చచ్చిపోయిన రాత్రి గుర్తుందా .... అదేరా .... మొన్న—"

ఇద్దరికి గుర్తు వచ్చింది—నాకు సరిగా గుర్తు రావటం లేదు. అలా అంటే యెక్కడ చెప్పడోఅని అవునవు నన్నాను మిగతా ఇద రితో కలిసి.

"శరిగ్గా ఆ రాత్రి."

రాత్రి మెదిలింది మా కళ్లముందు. తడి పొడిగా అంటే అంటనట్లున్న వెన్నెల వెలుగులో ఆస్పత్రి.

"థియేటర్‌లో పనుండి వెళ్లాను. ఆ ప్రక్కన గది లేదూ—మూలగా అప్పుడు లైటుకూడా లేదా గదిలో—అక్కడ చూశాను ఈమెనీ, శంకరంగాడ్నీ—నా చప్పుడు వినగానే ఏదో పని ఉన్నట్లు మాట్లాడుతూ బయట కొచ్చేసింది—ఇప్పుడు చెప్పండి—చీకట్లో యెవరూ లేనిచోట ఒక మగవాడికీ ఆడదానికీ .... యేముంటుంది,"

"మరీ హాస్పిటల్లోనా నేను నమ్మలేను."—ప్రసాద్.

"చంటిపాపలా మాట్లాడకురా చిట్టీ—ఆ ప్రోకర్ వెధవ హాస్పిటల్‌లో ఎందుకు పచార్లు చేస్తుంటా డంటావు. మనిషిలో నీతీ నియమం తప్పినప్పుడు ఎక్కడైనా ఒరగొచ్చు' —సుబ్బారావ్.

కాస్సేపు నిశ్శబ్దం తర్వాత సుబ్బారావే అన్నాడు.

"ఆ జాఫర్‌గాడితో యెన్నిసార్లు హైదాబాద్ వెళ్లలేదది..... పెలవుపెట్టి మూడ్రోజులు ఆ పీచు కాంపౌండర్ ఇంట్లో లేదూ .... ? చివరికి వార్డుబాయ్‌కూడా తెలుసు దీని సంగతి."

"అయితే ఆమెను నర్సింగ్ కోర్సునుంచి సస్పెండ్ చేసింది నిజమేనా ?" ఇంతసేపూ మౌనంగా ఉన్న చారిగాడు.

"సస్పెండ్‌చేయరు 'శత పురుషోత్సవం' చేసుకున్నందుకు సన్మానం చేస్తారు"—వ్యంగ్యంగా అన్నాడు సుబ్బారావ్.

"ఇంతకీ మనవాడు ఫూల్—దాని సంగతి హాస్పిటల్ బయట యే రిక్షావాడ్ని కనుకున్నా చెబుతాడు. ఇదో ఆదర్శం అనుకున్నాడు—వాడి ఖర్మ వాడికే తెలిసొస్తుంది" నిశ్చయంగా అన్నాడు రామారావ్.

"సుఖపడకూడదని నమ్మకం మాత్రం ఏమిటి—" ప్రసాద్.

"నేను బల్లగుద్ది చెబుతాను— —నాల్రోజుల్తరవాత వాడేడుస్తాడని ..... కొంచెం ఆగు నీకే తెలుస్తుంది. అది మరో

కడ్ని లేపుకుపోతే—ఉన్న వాళ్ళు డబ్బులా వదిలేస్తే ఉద్రేకం దానంతటదే దిగిపోతుంది—

.... నా బాధంతా అనవసరంగా వాడు 'లైఫ్ స్పాయిల్' చేసుకున్నాడనే—ఓ రెండేళ్లల్లో డాక్టరయ్యేవాడు. ఇప్పుడేం చేస్తాడు. వాళ్ల నాన్న ఒక్క పైస పంపడుకదా—కాస్త కడుపు మండితే ఆదర్శాలన్నీ వదుల్తాయి.''

''వాళ్ల నాన్న పంపడంటావా''—చారి.

''మొన్న రాలేదురా—నెత్తీ, నోరూ కొట్టుకు చెప్పాడు. వీడు వినలేదు. చివరికి విసిగి నీకూ, నాకూ సంబంధం లేదని చెప్పలేదూ ? పాపం మామ్ముందు కూడా కన్నీళ్లు పెట్టాడు.''

''ఇంకేం చదువు—ఆమె సస్పెండ్ అయింది—వీడి చేతిలో పైస లేదు—వదిలిపెడ్తానని మొన్నే చెప్పాడు—యేరా నువ్వే ఇచ్చావటగా వందరూపాయలు''—సుబ్బారావు.

''నీ సపోర్టుకూడా నన్నమాట—నేనైతే ఒక్క పైస ఇచ్చేవాడ్నికాదు—ఇటువంటి వెధవపనికి—ఆమెకు వీడొక్కడా—పెళ్లికి మాత్రం వీ డొక్కడే దొరికాడు పిచ్చివెధవ— రేపు వాడి ఫ్యామిలీ యేం కావాలి ?''—రామారావ్.

''అందరూ చేయని పనేదో చేయటం ఆదర్శం అయింది ఈ రోజుల్లో—ముందు వాడికే తెలిసొస్తుంది''—నొక్కి చెప్పాడు సుబ్బారావ్.

టైమ్ చూసుకుంటూ లేచాడు ।పసాద్—చారీ, రామారావూ ఏదో వాదించుకుంటున్నారు మెల్లగా.

బిల్లు పట్టుకుని బయటకు నడిచాను నేను.

*   *   *

రూములో ఒంటరిగా మిగిలిపోయాను. మూడు నెల్లుగా కలసి ఉన్నాం ఇద్దరమూ. చివరిదాకా ఒక్కమాట చెప్పలేదు వాడు. ఇంతకాలం కలిసిఉన్నా కనీసం ఒక ముక్కైనా చెప్ప నందుకు బాధ కలుగుతుంది—బహుశా వాడికి తెలుసేమో ఆమె అంటే ఎవరికీ సదభిప్రాయం లేదని. ఆమె ।పవర్తన మీద కొల్లలుగా ఉన్నాయి కథలు. మే మిద్దరం యెన్ని సార్లు 'డిస్కస్' చేయలే దామెను గురించి. ఆలోచిస్తే గుర్తు వస్తుంది. అనవసరమైన సానుభూతి చూపేవా డామెమీద. అసలు మొదటినుంచీ వాడి ప్రవర్తనే విచిత్రంగా ఉండేది. అందరూ ఏదంటే దానికి వ్యతిరేకంగా మాట్లాడేవాడు. వాడికి జీవితంమీదా ప్రబతుకు విధానం మీదా కొన్ని చిత్రమైన నిర్ణయా లుండేవి. ఏమైనా నా ఉద్దేశంలో వాడు చేతులారా జీవితాన్ని నాశనం చేసుకున్నాడు తాత్కాలికోద్రేకంలో—

ఓ స్త్రీ కోసం—మరీ—ఇలాంటిదానికోసం, డాక్టరుగా ఉన్న బంగారంలాంటి భవిష్యత్తునూ తనవాళ్లనూ, వాళ్ల ఆశలనూ, ఉన్న కట్టుబాట్లనూ తెంచుకుని వెళ్లటం ఏ మాద ర్శమో నాకు అర్థంకాదు.

ఏ వ్యక్తీ కేవలం తనకోసం తను బ్రతకడు—అతని భవిష్యత్తుని ఆశగా చూసే తల్లిదండ్రులూ, ఆసరాగా చేసుకుని పెరగవలసిన సోదరులూ ఉన్నారు. వీడు చేసిన పని ప్రభావం ఆ కుటుంబంమీద తప్పకుండా ఉంటుంది.

పోనీ, ఆమెలో ఏం చూసి ఇంత త్యాగం చేశాడో అర్థం కాదు. వాడికి ఇంతకన్నా అందమైనదీ, సంస్కారం కలదీ, ఎక్కువ ప్రేమించేదీ ఇతని భార్య అయ్యేది.

కొందరు స్త్రీలను చూస్తే భయమేస్తుంది. స్త్రీ అంటే ఇలా ఉండాలా అని అడిగితే చెప్పలేను కాని—ప్రతివాడూ 'ఇలా' ఉన్న అమ్మాయే తన భాగస్వామిని కావాలని కోరు కుంటాడు. ఆమెలో కొన్ని విలువలను ఊహల్లో నిర్ణయించు కుంటాడు.

సిగ్గు లేకపోవటం గొప్ప తప్పు కాకపోయినా, అందం కాదనుకుంటాను నేను. స్త్రీ సున్నితమైన అనుభూతులకు బాహ్యరూపం సిగ్గు. అది ఆమెలో ఏ కోశానా కనిపించదు. దగ్గరగా నుంచుని మాట్లాడ్తూంటే మనిషిమీద పడే ట్లుండేది—నదురూ, బెదురూ లేకుండా.

ఆమె నవ్వితే మరో 'వార్డు' లోకి వినిపించేది. ఎవరేం మాట్లాడినా వికృతమైన అర్థాలు తీసి అపహాస్యం చేసేది. మరణించిన రోగి మంచం ప్రక్కన నుంచుని సరదాగా 'జోక్సు', కట్ చేయటం ఎన్నోసార్లు చూశాను నేను.

ఎండిపోయిన ముసలివాడి వంటిమీద, ప్రక్కనున్నామెతో మాట్లాడ్తూ, 'కేర్‌లెస్' గా 'వీనస్ ఇంజెక్షన్' ఇవ్వటాన్కి పదిరంధ్రాలు పొడవటం చూశాను.

రోగులతో నిర్లక్ష్యంగానూ అసహ్యంగానూ మాట్లా డేది. సినిమాలో రోజు కొకడితో కనిపించేది.

ఏ మనిషీ అందరి దృష్టిలో 'చవక' కాదు ఏ కారణం లేకుండా.

చివరికి హాస్పిటల్ బయట రిక్షావాడు కూడా చాలా చవకగా వెకిలిగా మాట్లాడేవాడు ఈమెను గురించి.

—అందుకే ఈమెను చేసుకోవటం యవ్వనం విసిరిన గాలానికి అమాయకంగా చిక్కుకోవటం. భవిష్యత్తుని చీకటి చేసుకోవటం. ఆమె వీడిని ప్రేమించికావాలని పెళ్లి చేసుకుం దంటే ఇక్కడ నేనే కాదు, ఎవరూ నమ్మరు.

ఏపని చేసినా దానికి సమర్థనా, దాన్ని అందంగా చూపే ఆదర్శమూ ఉంటాయి.

ప్రతి వ్యక్తి కుటుంబానికీ తద్వారా సంఘానికీ బాధ్యు డవుతాడు. జరిగిపోయే కాలంలో, సవరించుకున్న అనుభవంతో కొన్ని హద్దు లుంటాయి సంఘంలో—

వీడు చేసిన పని ఆదర్శమూ, ఏదో మార్పులో ముంద డుగూ అంటే మార్పు మంచి కావచ్చు, చెడు కావచ్చు. ఇలా ఎదిరించినందుకు అతనికో ప్రత్యేకత ఉండవచ్చు. అది మనిషి ఉన్నతి వైపే ప్రయాణించే ధైర్యం కానవుసరంలేదు.

కాలప్రవాహంలో కొట్టుకుపోవలసిన మనిషి, నలు గురూ నడిచే నిర్ణీత పథంలో ఉన్న కొద్దీ జీవితానికీ అర్థం కలిపించుకోవలసిన మనిషి, ఈ ప్రవాహంలో ఎదురీదితే మునిగి శవమై తేల్తాడు.

స్వార్థంతో క్షణికోద్రేకంలో చేసిన వెర్రిపని— ముందు రోజుల్లో తనని తను క్షమించుకోలేక మిగిలిపోయి నప్పుడు, భవిష్యత్తు బుద్ధి చెబుతుంది వీడికి.

పోనీ ఆమెతో ఉన్నతమైన ప్రేమ అనుకుంటే—

అది ఆత్మవంచన. యంత్రంలాంటి ఆమె కామానికి చెప్పుకునే మారుపేరు. నాలోజుల్లో తెలుసుకుంటాడు— తను ఎండమావుల్లో ప్రయాణిస్తున్నాడని—

ఇవి నా, అభిప్రాయాలు.

నన్ను మాట్లాడటాన్కి కూడా టైము ఇవ్వకుండా 'బెజవాడ వెళ్తున్నాం—రిజిష్టర్ మ్యారేజికి—అని చెప్పి వంద రూపాయలు తీసుకెళ్లాడు.

ఆ మర్నాడు ఇవే అభిప్రాయాలతో ఉత్తరం రాశాను నేను వాడికి.

*　　*　　*　　*

నేను రాసిన ఉత్తరానికి నాలుగు రోజుల తర్వాత వాడి జవాబు ఇది—

రాజా,

నీ ఉత్తరం 'రిజిస్ట్రారు ఆఫీస్' లో పెళ్లయిన మూడు గంటల తర్వాత చేరింది.

నీ అభిప్రాయాలు నిష్కర్షగా చెప్పినందుకు, మిత్రుడిగా నామీద ఉన్న అభిమానానికీ—సంతోషం.

మళ్లీ నీకు చాలాకాలం వరకూ కన్పించకపోవచ్చు నేను. నా వ్యక్తిగతమైన విషయాలకు, నీకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేకపోయినా—నేను బాగుపడాలని తీవ్రంగా కోరు తున్నందుకూ—నేను మోసపోయానని బాధపడుతున్నందుకూ— విను.

నీవు వ్రాశావు "ఆమెలో ఏం చూసి ప్రేమించావని". ఆమెకోసం నేను ఉజ్వల భవిష్యత్తును వదులుకుని చేసే త్యాగం అర్థరహితమనీ."

—ప్రేమించానని నీవే భావనలో అంటున్నావో అర్థం కావటంలేదు. నిర్దుష్టమైన అర్థం లేనిదే ఆ పదాన్ని నాకు నేను ఆపాదించుకోను.

నాలుగు నెలలుగా, నా కామెతో పరిచయం—క్రమంగా సన్నిహిత మయ్యాము—స్నేహితులుగా తిరిగాము.

ఏ విషయాన్ని 'సీరియస్‌గా' ఎప్పుడూ తీసుకోదామె. ఇది తప్పు, ఇదికాదు— అని నిర్ణయపు హద్దుల్లో ఉండాలనుకో దామె. ఆమె అనుభవాలు ఆమెకు, అవి నేర్పలేదు. జీవితాన్ని తేలిగ్గా తీసుకుని హాయిగా జీవించటం తెలుసామెకు. పసిపిల్లలో అమాయికత, వేదాంతిలో నిర్లిప్తతా ఉన్నా యామెలో—ఈ ఆనందాల్లో దుఃఖాల్లో బాధల్లో .... అన్ని అనుభూతుల్లో ఉన్నట్లు కనబడి వాటి కతీతంగా జీవించటం తెలుసామెకు. ఆమె ఒక పాత్రలా ఈ బ్రతుకు నటించగలదు. ఇవేమీ అంటని మరో వ్యక్తిత్వం ఉంది ఆమెలో—

ఇదే నే కోరింది—పిరికితనం ఎరుగనిది ఆమె. నీవు చాలా రాశావు ఆమెను గురించి. నీవు ఒక కోణం నుంచి చూశావు—నేను మరొకవైపునుంచి. గడవబోయే కాలంలో, నేను మోసపోతే అనుభవంగా తీసుకుంటాను. అంతేకాని మోసపోతానని ఊహించుకుని ఇప్పు డామెను వదులుకోలేను.

నాలుగు నెల్లు ఆమెతో తిరిగాను. ఆమెను వీలైనప్పు డల్లా అనుభవించాను—ఆమె తనకు తానుగా, ఎప్పుడూ నన్నడగ లేదు వివాహం చేసుకోమని—ఆమె తనివ్వగలిగినంతా నా కిచ్చింది. —'నీవు నా క్కావాలి. పెళ్లి చేసుకుందాం' అని అడిగినప్పుడు, "భరించగలవా", అంది. ఆమె కాదనలేదు—అవుననలేదు.

ఆమె గతం నీలాగా నాకూ తెలుసు.

గుండెమీద చేయి వేసుకుని చెప్పు—రేపు నీభార్య కాబోయే ఆమె పవిత్రత నీకెలా తెలుసో—పిచ్చిగా నమ్ముతావు. గుడ్డిగా బ్రతుకుతావు. ఆ నమ్మకం వమ్మైనప్పుడు బాధపడతావు. నీ నమ్మకం మీద నీ కంత విశ్వాసం !

ఆమె ఒళ్లో పడుకుని నీ కోసమే ఆమె సృష్టించ బడినట్లు కలలు కంటావు.

అవకాశం ధైర్యం ఉంటే నీ వెన్నిసార్లు చెడిపోయే వాడివి కాదు—? ప్రక్కింటి పంతులు భార్యని చూసి, నీ వెన్ని తియ్యని కలలు కనలేదు ? ఆమె చూస్తే నీ కోసమే అన్నట్లు కొట్టుకునే వాడివికదా ?— నీకో ఆమెకో ధైర్యం ఉంటే నీ నీతి యేమయ్యేది ?

నాకు తెలిసిన, విన్న ఆమె గతం నా కనవుసరం—ఆమెతో పాటు ఆ చరిత్రనూ స్వీకరించే ధైర్యం ఉంది.

,'నీవు సుఖపడవు అన్నావు.''

ఎందుకో నాకు తెలియదు. మెడిసిన్ చది డాక్టరైతే ఆర్థికంగానూ, ఈ సంఘంలో ఉన్నతిలోనూ, ఉండేవాణ్ణి. అదే సుఖమైతే మనకన్నా ఆర్థికంగానూ ఉన్నతిలోనూ ఉన్నవాడు ఇంకా ఎక్కువ సుఖపడాలి. పూటకు రొట్టెలేని వాళ్ళ ఆత్మ హత్య చేసుకోవాలి.

సుఖం సంతృప్తిలో ఉంది—మనస్సులో ఉంది—అంత స్తులో లేదు. పెరుగుతున్న ఆశలో చేరవలసిన దశ ఎప్పటి కప్పుడు దూరమవుతూనే ఉంటుంది.

అందుకే నీ వనుకునే సుఖాన్ని ఎప్పటి కప్పుడు నేను సృష్టించుకోగలను పరిమితంగా—

''ఇక ఆమెతో నంటావా ?''

ఆమె నాతో ఉండటాన్కి ఇష్టపడింది—ఆమెనుంచి భవిష్యత్తు ఈవిధంగా ఉండాలని కోరటంలేదు. ఆ అధికారం లేదు నాకు—

రేపు నీ భార్య ఎవరితోనో లేచిపోదని గ్యారంటీ ఏమిటి. ఇది ఇలా జరగాలి. జరుగుతుందని భవిష్యత్తుపై ఇంత విశ్వాసం ఉంచుకుని ఈరోజు నిన్ను నీవు మోసం చేసుకో టంలో అర్థమేమిటి—?

''ఇదేదో ఆదర్శం అనుకుంటున్నావు''—అని వ్రాశావు నీవు.

ఏది ఆదర్శమో, ఏది కాదో నాకు తెలియదు. ఏ ఆదర్శా నికీ శాశ్వత విలువలేదు—ఒక స్త్రీకి అయిదుగురు భర్తలు ఆనాటి ఆదర్శం—ఇప్పుడు కాదు—

నలుగురూ నడిచే బాటను వ్యతిరేకించటం ఆదర్శమూ కాదు, నేరమూ కాదు. మేము నడచినట్లే నీవూ నడవాలని వాళ్ళు శాసించటం తప్పు.

నే చేసిన ఈ పనివల్ల సంఘానికి నష్టమూ లేదు. లాభమూ లేదు, నీవు భూతద్దంలోంచి చూస్తే తప్ప.

ఆదర్శవాది అనుకున్నా, నేరస్తుణ్ణి అనుకున్నా మీ యిష్టం. నా జీవితాన్ని నేను నిర్మించుకోటాన్కి నాకు సర్వాధికారాలున్నాయి. నా త్రోవన నే పోతుంటే మీకేదో కీడు చేస్తున్న ట్లనుకోవటం—పిరికితనం.

ఏదీ శాశ్వతం, మంచీ, చెడూ కాదు. ఈ విలువల్ని వ్యక్తులకు ఆపాదించేప్పుడు మన దృష్టి దోషం చాలా ఉంటుంది.

ఈరోజు హాయిగా ఉన్నాను. బహుశా రేపూ ఉండా లనుకుంటున్నాను. కాకపోతే చేసేది ఏమీ లేదు. జీవించటానికి జీవితం. జీవితం కోసం జీవించను నేను.

—రాధాకృష్ణ.

—ఇది నాకు చేరిన మొదటి ఉత్తరం. అంతా మొండి వాదన. తర్కం జీవితానికి అన్వయించలేం—చాలాసార్లు కొన్ని విలువలను మనం ప్రశ్నించలేము—వాడి మూర్ఖత్వం వాడే తెలుసుకుంటా డనుకున్నాను. కాని, అతన్ని పరిశీలించటం నా కవసరం అనిపించింది. వాడిలా అవుతాడని నేను నిర్ణయించు కున్నందువల్ల అడ్డు మార్గాల్లో ఈ దినం వాడు సుడి గుండలో పడే ప్రమాదం ఎప్పుడూ ఉంది.

ఫలితాలకోసం ఎదురుచూసే విద్యార్థి రోజా పేపరు చూసినట్లు వాడి విశేషాలు ఎప్పటి కప్పుడు తెలుసు కుంటున్నాను. ఇంతలో వాడు చేసిన తొందరపనికి తీవ్రంగా పశ్చాత్తాపపడవలసిన ఘటన ఒకటి జరిగింది.

దానికి వాడి జవాబు—

రాజుకు,

నేను చేసిన పనికి తలెత్తుకు తిరగలేక—అమ్మ నూతిలో దూకి ఆత్మహత్య చేసుకుందని వ్రాశావు. నేను చాలా బాధ పడ్డాను. తెలవగానే వూరు వెళ్ళాను. అప్పటికే అంతా అయి పోయింది. నన్ను ఇంటిగుమ్మం తొక్కనీయలేదు. నావల్లే ఇది జరిగిందని ఉమ్మేశారు కొందరు. ప్రతి వాడికీ ఉన్నట్లు నా తల్లిమీదా నాకూ ప్రేమ ఉంది. ఆమె మరణానికి అవ్వి తంగా దుఃఖపడ్డాను. కాని ఆమె మరణానికి కారణం నేను మాత్రం కాదు.

నాకు తెలియని దశలో నన్ను తన అభిరుచులకు అను గుణంగా మార్చవచ్చు. కాని నాకు వ్యక్తిత్వం వచ్చింది.

పక్షి తన గుడ్డును పొదుగుతుంది. గుడ్డు పోతే బాధ పడుతుంది. కాని, తన రెక్కలు రాగానే ఎగిరిపోతుంది పిల్ల.

నీవు నామీద వేసిన అభాండాలకు ఒకటి గుర్తువచ్చింది. చిన్నప్పుడు వివేకానందుడు పాఠం చెబుతూ అనేది అమ్మ.

''మహానుభావుడు అంత చిన్నతనంలోనే అడిగినవాడికి లేదనకుండా—ఇంట్లో దొంగతనంచేసి ఇచ్చాడుట పావులా— పూవు పుట్టగానే పరిమళిస్తుందని.''

ఓసారి ఒక పావలా వేశాను బిచ్చగాడికి—అమ్మ ఆరోజు కొట్టిన దెబ్బలు ఇంకా జ్ఞాపకం ఉన్నాయి.

ఏం ? నే చేసింది మంచిపని కాదూ ?—నన్నెందుక్కొట్టింది ?

దీనికీ ఒక సమర్థన ఉండవచ్చు.

చేసేది మంచికానీ, చెడు కానీ— ఆమె నన్ను రూపొందించాలనుకున్న విధానానికి అతీతంగా ప్రవర్తిస్తే ఊరుకునేది కాదు.

'కబడ్డీ' ఆడవద్దనేది—కథలు చదివితే చెడిపోతా రనేది—డాక్టర్ తప్ప ఇంకో కోర్సు వద్దనేది.

బహుశా నే నామె ఇష్టప్రకారం నడచివుంటే తను చూపించిన పిల్లను తను కోరిన కట్నానికి పెళ్లిచేస్సి ఉండేది.

చిన్నప్పుడు నయానా భయానా చెప్పి చేయించేది నాతో. ఇప్పుడు ఆ అవకాశం లేనందుకు ఏం చేయలేక 'చనిపోయి ఉంటుంది. ఇలా ప్రతి దశలో నన్నూ నా ఊహల్నీ, తన ఇష్టానుగుణంగా మార్చే హక్కు కేవలం కన్నందుకేనా ? నా సుఖం ఆమె కోరుతుంది. నే నీమెతో ఈ స్థితిలో సుఖంగానే ఉన్నానంటే ఎందుకు నమ్మలేదు. ? నీవు సరిగా ఆలోచిస్తే ఆమె మరణానికి కారణం నేను కాదు. నన్ను తను కొన్ని అంతస్థుల్లో ఊహించుకుని మా అబ్బాయి యిలా అవుతాడని నిర్ణయించుకుంది. అమలుజరిపే అధికారం ఆమెలో దాగిన స్వార్థాన్ని తృప్తిపరుస్తుంది.

అన్నీ కూలిపోయాయి.

ఆమె ఎందుకు చనిపోవాలో అర్థంకాదు. ఆమె ఆలోచిస్తే. ఆమెకు ఆలోచించే శక్తి లేనందుకు—ఒకేవిధంగా భవిష్యత్తును ఊహించుకుని, అలా జరగకపోయేసరికి ఇంత ఘోరం తలపెట్టినందుకూ—నేనేం చేయలేను· ఒక మనిషిని మనం ప్రేమించినంత మాత్రాన, నావాడు, అనుకున్నంత మాత్రాన—అతన్నుంచి తము కావల్సినవి కోరుకునే అధికారం లేదు, క్షమించలేని స్వార్థం ఉంటే తప్ప. అందరి తల్లులలో ఆమె ఒకతె—అందరిలిలా ఆశలు పెట్టుకుంది. కాని తీవ్రమైన నిరాశ ఎదురయింది. దాన్ని తట్టుకుని ఆలోచించే మనస్థైర్యం చాలా మందిలా, ఆమెలో లేదు. దీనికి ఆమె పెరిగిన వాతావరణం—సంస్కారం—సమకాలీన సంఘం—నామీద వక్రించిన అంచనాలూ ఇవన్నీ కారణం కావచ్చు.

ఇన్ని కారణాలు వంటరిగా ఆమెకు బతుకుమీద భయం లేదా విరక్తి కల్గించివుంటే—

నేనేం చెయ్యలేని పరిస్థితుల్లో—సానుభూతి తప్ప ఏం చూపగలను నేను? చనిపోయిందంటే తల్లికోసం నేనెంత దుఃఖిస్తున్నానో నీవర్థం చేసుకోలేవు. నాకు జన్మ నిచ్చినందుకు ఆమె కోరుకున్న విధంలో ఆమెకు ఋణం తీర్చలేని నా అశక్తతకూ బాధపడుతున్నా. ఇంతకన్నా ఎక్కువ రాస్తే నన్ను నేను సమర్థించుకోటానికి ప్రయాస పడుతున్నా నంటావు నీవే—

చివరికి ఒకటి చెబుతున్నాను.

ఆమె కావాలని ఆత్మహత్య చేసుకుందని కొంద రన్నారు· దానికి కారణం నన్ను చూపించి—

దొడ్డిలో బావికి పిట్టగోడ లేకపోవటంచేత, చీకట్లో కాలుజారి పడిఉండవచ్చని కొంద రన్నారు. ఏది నమ్మమంటావు—నన్ను అజ్ఞాత హంతకుడిగా చూస్తేనే నీకు తృప్తి ఉంటుంది కదూ—అలాగే కానీ.

నీ,

రాధాకృష్ణ.

కనీసం పై సంఘటనకన్నా పశ్చాత్తాపపడ్తా డనుకున్నాను. 'కాలుజారి పడిపోయిందని, నమ్మి తనను తను సమర్థించు కుంటున్నాడు. హంతకునికీ, దొంగకీ కూడా తాము చేసేపని న్యాయంగానే తోచవచ్చు. తర్కంతో సమర్థించుకోవచ్చు. కాని, మనిషి అయినందుకు, అంతరాంతరాల్లో యెక్కడో తెలుస్తుంది ఏది నిజమో, ఏది కాదో.

తప్పునే సరైందిగానూ, చెడునే మంచిగానూ — మూర్ఖంగా నమ్మేవాళ్లకు ఆ దేముడే నిష్కృతి చూపాలి.

చెప్పలేనంత అసహ్యం కలిగింది వీడిమీద. అందుకే తర్వాత ఉత్తరం వ్రాయలేదు నేను.

మూడు సంవత్సరాలు గడచిపోయాయి. ఉన్నట్లుండి ఒక ఉత్తరం వచ్చింది. వాడి దగ్గర్నుంచి.

రాజా,

నీ దగ్గర్నుంచి ఉత్తరాలు లేవు—ఎందుకో నాకు తెలుసు నిన్ను చూస్తుంటే నాకు జాలివేస్తుంది.

నీవు రచయితవు అంతో ఇంతో—

ఇది ఒక కథైతే, నాలా చేసినవాడు—తన తప్పును తెలుసుకుని పశ్చాత్తాపపడి ఏ ఆత్మహత్యో చేసుకునేవాడు. ఆమె ఎవరితోనో లేచిపోవటమో, కాకుంటే ఏ ఆశ్రమంలోనో చేరి భగవంతుడి దగ్గర 'నిష్కృతి' కోసం తపస్సు చేయటమో చేసేది.

కాకుంటే,

సంఘపు ఆంక్షల మధ్య, ఒకరిమీద ఒకరు నమ్మకంలేని దొంగల్లా రోజుకు వందసార్లు చస్తూ, బతుకుతూ చివికిన జీవితం గడిపేవారు.

అప్పుడు నా పాత్రమీద సానుభూతి కలిగేది నీకు.

ఇంతదాకా ఎందుకు—

వర్ణాంతర వివాహాలను ఓ ఆదర్శం అనుకుంటారు.

—అలా కథ రాసి ఇద్దరూ హాయిగా ఉన్నట్లు ఎందుకు రాయరో అర్థంకాదు—హాయిగా ఉన్నవాళ్లు లేరా ?

రచయితకు వాళ్లలో 'బలహీనతల్లో' ఉండే నమ్మకం వారి ఆత్మ స్థైర్యం మీద ఉండదు.

దేవదాసే పార్వతితో పారిపోయి—సుఖంగా ఉంటే అంత సానుభూతి ఉండదు ఆ పాత్రమీద.

సంఘంలో ప్రతి మార్పునీ ఆదర్శంగానో, విచిత్రంగానో, తప్పుగానో చూసి—తమ మనస్తత్వాల పరిధిలో వాళ్ల భవిష్యత్తును నిర్ణయించ బూనటం తెలివితక్కువ.

నీవు నా కనేక ఉత్తరాలు వ్రాశావు. ప్రతి ఉత్తరంలో ఇంతో అంతో భయపెడ్తూ—చివరికి నా తల్లి పోయినప్పుడు —నేనే కారణం అని నన్ను సాధ్యమైనంత బాధపెట్టి నా తప్పుని ఒప్పించాలని చూశావు. అందుకే పది పేజీల ఉత్తరం వ్రాశావు నామీద నేరారోపణలతో.

నేను ఆమె చేతిలో మోసపోయి, జీవితంలో ఓడిపోయి నీవు అనుకుని, నా కంటగట్టిన ఆదర్శంలో—పొరపాటుకు పశ్చాత్తాప పడాలని, సానుభూతికీ, జాలికీ ఎదురుచూసే కథలో పాత్రలా—నా వ్యక్తిత్వాన్ని ఊహించుకుని ఆ రోజుకోసం ఎదురు చూశావు.

నిరాశపడ్డావుకదూ ?

ఇన్ని కోట్ల మందిలో, నేనొక చిన్నమనిషిని, నా దోవన నేను బ్రతుకుతానంటే మీ కెందు కంత బాధ చెప్పు ?

—అక్కడ ఉద్యోగం వదిలేశాను, ఆఫీసులో గుమాస్తాగా—చివరకు ఆఫీసరు క్రింద బానిసలా మారవలసి వచ్చినందువల్ల—

తర్వాత చాలా చిక్కులు పడాల్సి వచ్చింది. కొన్ని రోజులు అన్నమే లేదు మా యిద్దరకూ.

చివరకు ఇక్కడకు చేరుకుని బొగ్గు గనిలో కూలీగా పనిచేస్తున్నాను—నాల్గు నెలలనుంచీ—ఆమె 'మిషన్' కుడ్తూంది. త్వరలో చిన్న కిళ్లీకొట్టు పెడ్దామనుకుంటున్నాను.

రోజులు హాయిగా గడచిపోతున్నాయి—నీవు ఊహించుకునే కనీస బాధలూ విచారాలూ ఏమీ లేవని రాస్తే బహుశా నీవు నమ్మవు.

మాలో మాకు సంతృప్తి ఉంది. విశ్వాసం ఉంది. పరిమితమైన ఆశతో ఏ క్షణానికి ఆ క్షణం జీవించగలిగే శక్తి ఉంది.

రేపటిమీద నాకు భయంలేదు. ఆలోచన లేదు. ఎదుర్కొనే ధైర్యం ఉందని మాత్రం అనుకుంటున్నాను.

నా జీవితాన్ని నేను స్వేచ్ఛగా నా ఇష్టం వచ్చిన సంతృప్తిలో నిర్మించుకుంటున్నాను—ఇది చాలు నాకు.

మనిషి చేయలేనిది ఏమీ లేదని, నీవూ, నేనూ చదువుకున్నాం—పుస్తకాల్లో.

అల్పత్వం, పిరికితనం లేకపోతే మనిషి ఆత్మవిశ్వాసానికి మరణంలేదు.

చరిత్రలేని (చరిత్ర) ఉంటుంది—ప్రతివాడికీ. దానిని చూసి నాకోసం నేనైనా సంతృప్తిగా జీవించానన్న తృప్తి ఉంటే చాలు నాకు.

నీకు నిరాశ కలిగిస్తే—కోపం తెచ్చుకోకు. వీలైతే—క్షమించు.

—రాధాకృష్ణ.

ఈ ఉత్తరం చూసిన తర్వాత అతనితో నాకున్న అవసరం తీరిపోయినట్లనిపించింది. కొన్ని విలువలను తారుమారు చేసి బ్రతుకుతున్నాడు వాడు—ఏది వాస్తవమో ఏది ప్రతిబింబమో నాకు అర్థంకాలేదు.

తర్వాత వాడికి ఉత్తరం వ్రాయనేలేదు, ఇప్పటివరకూ.

